ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



5న చంద్రబాబు రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా' పేరుతో ఈనెల ఐదో తేదీన అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరగనున్న సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఐదో తేదీ ఉదయం విశాఖనగరానికి చేరుకుని ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గొండుపాలెం వెళతారు. అక్కడ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఏలూరు జిల్లా చింతలపూడి వెళతారు.

గూడుపుఠాణి!



పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీ వద్ద చదును చేసిన డి.పట్టా భూమి

వైసీపీ నేతలు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కు

- పిసినికాడ రెవెన్యూ పరిధిలో డి.పట్టా భూములు అక్రమంగా కైవసం
- ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేకుండా చదును పనులు
- నాలుగు రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద
- పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోని అధికారులు
- తెరవెనుక మంత్రి ముఖ్య అనుచరుడు ఉన్నట్టు ఆరోపణలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బి.ఆర్.టి.కాలనీలో వైసీపీ నేతల భూదందా వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. రెవెన్యూ అధికారులతో వైసీపీ నేతలు లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని నిబంధనలకు విరుద్ధంగా డి.పట్టా భూముల్లో పాగా వేసినట్టు స్పష్టమవుతోంది. గతంలో వీఆర్‌ఏగా పనిచేసి బదిలీపై వెళ్లిన రెవెన్యూ ఉద్యోగితో, స్థానిక అధికార పార్టీ నేతలు కుమ్మక్కై, సర్వే నంబర్లు 362, 363, 364, 365, 366, 367, 368, 369, 370, 371ల్లో సుమారు 80 ఎకరాల డి.పట్టా భూములను నిబంధనలకు విరుద్ధంగా సాగుదారుల నుంచి తీసేసుకున్నారు.

నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు వినియోగించాల్సి వస్తే.. ముందుగా రెవెన్యూ శాఖ నుంచి అనుమతి పొందాలి. స్థానిక గ్రామ పంచాయతీ నుంచి కూడా అనుమతి పొందాలి. కానీ అధికారం చేతిలో వుండడంతో వైసీపీ నాయకులు, స్థానిక రెవెన్యూ అధికారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం డి.పట్టా భూములను చదును చేస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ కోసం గ్రామ పంచాయతీకి, మండల రెవెన్యూ అధికారులకు కనీసం దరఖాస్తు కూడా చేయలేదని సమాచారం. ఈ భూ దందాకు తెరవెనుక కశింకోట మండలంలో మంత్రికి ప్రధాన అనుచరుడిగా చలామణి అవుతున్న వైసీపీ ముఖ్యనేత వున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే రెవెన్యూ, గనుల శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పిసినికాడ పంచాయతీలో డి.పట్టా భూములు అక్రమంగా చేతులు మారడం, రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం చదను చేయడంపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. అయినా సరే రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడలేదు. కాగా పిసినికాడలో డి.పట్టా భూములను చదును చేస్తున్న వైనంపై వీఆర్‌ఓ పద్మను వివరణ కోరగా, తమకు ఎటువంటి సమాచారం లేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

25 మంది తహసీల్దార్లు జిల్లాకు రాక

- మండలాలు కేటాయించిన కలెక్టర్

అనకాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు కేటాయించిన 25 మంది తహసీల్దార్లకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి గురువారం మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 30వ తేదీలోపు ఉద్యోగ విరమణ చేయనున్న నలుగురు తహసీల్దార్లను జిల్లాలోనే సర్దుబాటు చేశారు. బి.రాజేశ్వరరావు (కలెక్టరేట్ ఏ సెక్షన్ సూపరింటెండ్), ఎంఎ శ్రీనివాస్ (కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్), బి.సత్యనారాయణ (కలెక్టరేట్ భూవిభాగం సూపరింటెండెంట్), డి.రామ్మూర్తి (కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్), వీవీఎల్ఎన్ గంగాధరరావు (ఆర్డీఓ కార్యాలయం ఏఓ), వి.ప్రకాశరావు (నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం ఏఓ)గా నియమితులయ్యారు. మండలాల తహసీల్దార్లుగా కె.శ్రీనివాసరావు (అనకాపల్లి), పి.సరోజిని (అచ్యుతాపురం), కె.శ్రీకాంత్ (బుచ్చెయ్యపేట), పి.వేణుగోపాలరావు (చోడవరం), జి.లక్ష్మీనారాయణ (దేవరాపల్లి), ఆర్.అప్పలరాజు (ఎలమంచిలి), జె.ఈశ్వరమ్మ (కె.కోటపాడు), ఎల్.మధుసూదన (కశింకోట), బి.పాపారావు (మునగపాక), ఎన్.గణపతిరావు (పరవాడ), బి. అప్పలస్వామి (రాంబిల్లి), జె.చలమయ్య (సబ్బవరం), బి.ప్రకాశరావు (చీడికాడ), జి.ప్రభాకర్‌రాజు (గొలుగొండ), బి.వెంకటరమణ (కోటవురట్ల), బి.మురళీమోహన్‌రావు (మాకవరపాలెం), ఎం.శ్రీకాంత్ (నక్కపల్లి), ఎస్.రమేశ్‌కుమార్ (నాతవరం), ఎ.శ్రీరాములు (నర్సీపట్నం), జీపీ సూర్యనారాయణ (పాయకరావుపేట), ఎస్.రమణారావు (రావికమతం), కె.రవిచంద్ర (రోలుగుంట), టి.సత్యనారాయణ (వి.మాడుగుల) నియమించారు.

ఇద్దరు డీఎస్పీలు బదిలీ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 1: జిల్లాలో ఇద్దరు డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావును అమలాపురం డీఎస్పీగా, అనకాపల్లి డీటీసీ డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావును బొబ్బిలి డీఎస్పీగా బదిలీ చేశారు.

ఐదుగురు ఎస్ఐలు బదిలీ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 1: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మురళీకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ డి.శేఖరంను చోడవరం యూపీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం.పాపయ్యను రాంబిల్లి యూపీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న జె.రామారావును పాయకరావుపేట యూపీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న వి.రమణను నక్కపల్లి యూపీఎస్‌కు బదిలీ చేశారు. ఎస్ఐ ఎన్. ప్రభాకరరెడ్డిని రేంజ్ డీఐజీ హరికృష్ణ అనకాపల్లి జిల్లాకు కేటాయించగా ఈయన ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు.

సమరమే..



నేటి నుంచి విశాఖలో భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్



రోహిత్ శర్మ



బెన్ స్టోక్స్

వేదికగా ఏసీఏ వీడీసీఏ స్టేడియం

- తొలి టెస్టులో గెలుపుతో ఉత్సాహంగా బరిలోకి ఇంగ్లండ్
- కలిసొచ్చిన పిచ్‌పై టీమిండియా విజయంపై అభిమానుల ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 1: ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న రెండో టెస్ట్‌కు భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు సిద్ధమయ్యారు. మ్యాచ్ కోసం మంగళవారం నగరానికి చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లు బుధ, గురువారాల్లో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఓటమితో సిరీస్‌లో వెనుకబడిన టీమిండియా విశాఖ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు తొలి టెస్టులో విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ జట్టు సిరీస్‌లో ఆధిక్యాన్ని కొనసాగించాలనే ధ్యేయంతో ఉంది. దీంతో మ్యాచ్ రసవత్తరంగా జరిగే అవకాశం ఉంది.

కలిసొచ్చిన పిచ్‌పై ఆశలు

ఇక్కడి పిచ్ భారత్‌కు కలిసొస్తుందని అభిప్రాయాలున్నాయి. ఈ పిచ్‌పై జరిగిన (వన్డే, టీ20, టెస్టు వంటి అన్ని ఫార్మట్లు) మ్యాచ్‌లలో భారత్ తొంభై శాతం విజయాలు సాధించింది. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌లలో భారత్ జట్టు భారీ తేడాతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే టెస్టులో కూడా గెలుపు ఖాయమని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే ఈ పిచ్‌పై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలతో కదంతొక్కిన రోహిత్‌శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ జట్టుకు దూరం కావడంతో యువ ఆటగాళ్లు శుభమన్ గిల్, శ్రేయాస్ అయ్యార్, జైస్వాల్‌పై ... మిగతా 7వ పేజీలో

ప్రధాన ఆకర్షణగా లోకల్ బాయ్ భరత్



భరత్‌ను సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

లోకల్ బాయ్ కోన శ్రీకర్ భరత్ ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. వికెట్ కీపర్ అయిన భరత్...హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో నాలుగు క్యాచ్‌లు పట్టడంతోపాటు బ్యాటింగ్‌లోనూ (తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులు) రాణించాడు.

వీధుల్లో ఓపెన్ బార్‌లు!

పట్టపగలు బహిరంగంగా మద్య పానం

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న మహిళలు, యువతులు
- చోద్యం చూస్తున్న పోలీసులు



ఎలమంచిలి రంగా వారి వీధిలో పట్టపగలు మద్యం సేవిస్తున్న మందుబాబులు. పేరుకుపోయిన ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం మద్యపానాన్ని నియంత్రిస్తున్నదా? లేకపోతే ప్రోత్సహి స్తున్నదా? అని పట్టణ ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తు న్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయాలు, విద్యా సంస్థలకు సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నివాస ప్రాంతాల్లో మందుబాబు మద్యం సేవి స్తూ వీధులను ఓపెన్ బార్‌లుగా మార్చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఎలమంచిలి పట్టణం ఐదో వార్డులో మెయిన్ పక్కన త్రిమూర్తులుస్వామి ఆలయానికి సమీపంలో, బాలికల వసతిగృహానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు.. పక్కనే వున్న రంగా వారి వీధిలోకి వచ్చి సేవిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్న తేడా లేకుండా ఎప్పుడు చూసిన ఇక్కడ మద్యం సేవిస్తూనే వుంటారు. పూర్తిగా నివాస ప్రాంతమైన ఈ వీధిలో నుంచి రాకపోకలు సాగించడానికి భయంగా వుందని మహిళలు, యువతులు, వసతిగృహం విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని అంటున్నారు. కాగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నివారించాలని గత మునిసిపల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు కోరారు. కానీ ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ప్చ్..



మధ్యంతర బడ్జెట్‌పై వేతన జీవుల పెదవివిరుపు

- ఆదాయ పరిమితి పెంచుతారని ఆశించిన ఉద్యోగులు
- పాత విధానం కొనసాగుతుందన్న కేంద్ర మంత్రి
- ఇతర కేటాయింపులపైనా స్పష్టత కరువు
- రైల్వే జోన్ పనులు ప్రారంభం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్న రైల్వే మంత్రి
- స్థలం కేటాయించలేదని వెల్లడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న వేతన జీవులను మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా నిరాశపరిచారు. కేవలం మూడు నెలల కోసం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఉద్యోగులు అంతా ఆదాయ పన్ను పరిమితి పెంచుతారేమోనని ఆశగా ఎదురుచూశారు. కానీ పాత విధానమే కొనసాగుతుందని ఆమె ఒక్క మాటలో తేల్చి పడేశారు. ఇక మిగిలిన కేటాయింపులపైనా స్పష్టత లేదు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదు. అయితే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాత్రం జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించలేదని పేర్కొన్నారు.

తీర ప్రాంతాల్లో ఆక్వా పార్కులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సముద్ర తీర ప్రాంతం 130 కిలోమీటర్లపైనే ఉండడంతో ఒకటి, రెండు ఏర్పాటుచేసే అవకాశం ఉంది. ఆర్థిక రంగాన్ని పరుగులు తీయించడానికి రైల్వే శాఖ మూడు కారిడార్లను నిర్మిస్తుందని వెల్లడించారు. ఇందులో ఒకటి ఖనిజాలు, సిమెంట్ రవాణాకు కాగా మరొకటి పోర్టులను అనుసంధానం చేస్తుంది. ఇంకోటి అధిక రద్దీ ఉన్న ప్రాంతాలను కలుపుతూ వేస్తారు. విశాఖ జిల్లాలో రెండు పోర్టులు ఉండడం వల్ల లాజిస్టిక్స్ రంగం విస్తరిస్తుంది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

- గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీని ప్రోత్సహించాలని నిర్ణయించారు. సముద్ర తీర ప్రాంతాల్లో వీటిని పెడతారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలు దీనికి అనుకూలం. కొత్త పెట్టుబడులు వస్తాయి.

వ్యవసాయరంగానికి అరకొర కేటాయింపులు



వ్యవసాయ రంగానికి సముచిత రీతిలో కేటాయింపులు జరపలేదు. నూనె గింజల ఉత్పత్తి, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని ఆర్థిక మంత్రి చెప్పినప్పటికీ వీటికి ఎంత నిధులు కేటాయించారో బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ప్రధాన రంగాల్లో ఒకటైన వ్యవసాయానికి తక్కువ కేటాయింపులు జరిగాయి. రైతుల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ఏవీ ప్రకటించలేదు. దీర్ఘకాలిక నిధిని ప్రైవేటు రంగానికి కాకుండా పబ్లిక్ రంగంలోని పరిశోధన సంస్థలకు కేటాయించి ఉంటే బాగుండేది..

- డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, వ్యవసాయ ఆర్థికవేత్త, ఆర్ఏఆర్ఎస్, అనకాపల్లి

పీఎం కిసాన్ నిధి పెంపు లేనట్టేనా!

రూ.6 వేలను రెట్టింపు చేస్తారని ప్రచారం

- ఎన్నికల వేళ పెంపు ఖాయమని భావించిన అన్నదాతలు
- బడ్జెట్‌లో ప్రస్తావించని కేంద్ర ఆర్థిక మంత్రి

అనకాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. ప్రధానంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న 'పీఎం కిసాన్ పథకం' సాయం పెంచుతారన్న అన్నదాతల ఆశలపై కేంద్ర మంత్రి నీళ్లు చల్లారు. ఈ పథకం కింద రైతులకు ఒక్కో విడతలో రూ.2 వేలు చొప్పున ఏడాదిలో మూడుసార్లు రూ.6 వేలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఆరేళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇంతవరకు సాయం పెంచలేదు. ఈ ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'పీఎం కిసాన్ పథకం' సాయాన్ని రెట్టింపు చేస్తూ బడ్జెట్‌లో ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఎటువంటి అదనపు కేటాయింపులు జరపలేదు.

అన్ని వర్గాలకు నిరాశే!




కేంద్ర ప్రభుత్వ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశ పరిచింది. ఆదాయ పన్ను పరిమితి విషయంలో ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లను ఆర్థిక మంత్రి మరోసారి నిరాశ పరిచారు. నిజాయితీగా పన్నులు చెల్లిస్తున్న వారికి.. ముఖ్యంగా వయోవృద్ధులైన పెన్షన్‌దారులపట్ల కనికరం చూపలేదు. క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని చెప్పే పాలకులు.. క్రీడాకారులకు రైల్వే చార్జీల్లో రాయితీలు ఇవ్వకపోవడం శోచనీయం. వృద్ధులకు రైలు చార్జీల్లో రాయితీలను కరోనా సమయంలో ప్రభుత్వం రద్దు చేసింది. ఇంతవరకు రాయితీను పునరుద్ధరించకపోవడం బాధాకరం.

- కేఎన్‌వీ సత్యనారాయణ, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, అనకాపల్లి

ఓటరు జాబితాల్లో చిత్ర విచిత్రాలు!

ఐదేరేళ్ల క్రితం చనిపోయిన వారికీ ఓట్లు

- జాబితాల నుంచి తొలగించడంలో బీఎల్‌వోలు నిర్లక్ష్యం
- దొండపూడిలో 34 ఆత్మలకు ఓట్లు!



దొండపూడి ఓటరు జాబితాల్లో తొలగించని మృతుల పేర్లు

రావికమతం, ఫిబ్రవరి 1: తుది ఓటరు జాబితాల్లో కూడా తప్పులు కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లో, బీఎల్‌వోల నిర్లక్ష్యమో తెలీదుగానీ ప్రతి పోలింగ్ బూత్‌లోని ఓటరు జాబితాలు అస్తవ్యస్తంగా వున్నాయి. ఐదేరాళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు కూడా ఓటరు జాబితాల్లో వుండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

రావికమతం మండలం దొండపూడిలో మొత్తం 3,055 మంది ఓటర్లు వున్నట్టు తుది జాబితాల్లో అధికారులు ప్రకటించారు. గ్రామంలో నాలుగు పోలింగ్ బూత్‌లు వున్నాయి. పోలింగ్ కేంద్రం 52లో 16 మంది, 54 బూత్‌లో ముగ్గురు, 55వ బూత్‌లో 15 మంది చనిపోయిన వారి పేర్లు వున్నాయి. వీరిలో గూడెపు సన్యాసమ్మ, గర్రెడ్డి సన్యాసినాయుడు, గర్రెడ్డి పెంటమ్మ, గర్రెడ్డి చిన అచ్చింనాయుడు, షేక్ రాజా షాహేబ్, జామి రాజులమ్మ, గూడెపు దేముడు దొర, గూడెపు చినబాబు, గొంతిన రాజుబాబు, గోపుసాల అప్పలనర్స, ధర్మిశెట్టి ముసిలినాయుడు, మిత్తాన వెంకట రమణ, నందారపు లోవరాజు, తోట సోమునాయుడు, తోట అప్పారావు, సోమిరెడ్డి రాజిబాబు, శరపాక కాసమ్మ, సుంకర దేముడు, చిట్టమోజు అబద్ధం, చిన్నం రాజబాబు, మారుతి ముత్యాలమ్మ, కాశెట్టి చింతల్లి, గాలి అచ్చుంనాయుడు, కోరుబిల్లి రమణ, ఎత్తుల నూకాలమ్మ, గనిశెట్టి చిలుకమ్మ, గర్రెడ్డి దేముడమ్మ, అడ్డూరి సోములమ్మ, గర్రెడ్డి రామునాయుడు, గర్రెడ్డి కాంతం, మజ్జి చింతల్లి, దుప్పట్ల నూకరాజు, మట్టా లక్ష్మి, చందక రాజేశ్వరరావు వున్నారు. ఇక దొండపూడికి పక్కనే వున్న మత్సవానిపాలేనికి చెందిన సోమిరెడ్డి పావని, గ్రంధి లక్ష్మి, బూరవు సాయి మణి తదితర పది మంది పేర్లను దొండపూడి ఓటరు జాబితాల్లో వున్నాయి. వీరికి అటు మత్సవానిపాపాలెం, ఇటు దొండపూడి గ్రామాల్లో ఓటర్లుగా వుండడం గమనార్హం.

గ్రామ వలంటీర్ హత్య?

- రక్తపు మడుగులో మృతదేహం
- ముఖంపై బలమైన గాయాలు
- మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం పొలాల్లో ఘటన





నడింపల్లి హరినాథ్ (ఫైల్ ఫొటో), సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ, పోలీసు అధికారులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 1: మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీరు ఒకరు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. ముఖంపై బలమైన గాయాలు వుండడం, మృతదేహం వద్ద రక్తం మడుగు వుండడంతో స్థానికులు హత్యగా భావిస్తున్నారు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి.

లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి హరినాథ్ (25) గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి బుధవారం సాయంత్రం పంచాయతీ సిబ్బంది నుంచి లక్షా పది వేల రూపాయలు తీసుకుని ఇంటికి వచ్చాడు. డబ్బులను పెట్టెలో పెట్టి, జాగ్రత్తగా చూడాలని తల్లి ఈశ్వరమ్మకు చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఒక యువకుడు వచ్చి హరినాథ్ ఉన్నాడా? అని ఆమెను అడిగాడు. ఇప్పుడే బయటకు వెళ్లాడని ఆమె చెప్పింది. కాగా రాత్రి ఎంతసేపు అయినాసరే హరినాథ్ ఇంటికి రాలేదు. గురువారం ... మిగతా 8వ పేజీలో

రెండో రోజూ ముమ్మర సాధన

ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా శుక్రవారం ప్రారంభం కానున్న రెండో టెస్ట్‌మ్యాచ్‌కు భారత్-ఇంగ్లాండ్ క్రికెటర్లు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. రెండోరోజు గురువారం ఇరు జట్ల క్రీడాకారులు ముమ్మర సాధన చేశారు. ఉదయం నుంచీ ముమ్మరంగా బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. ఆటవిడుపుగా కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశారు. మొదటిమ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించడంతో అచ్చొచ్చిన పిచ్‌పై భారత్ ఆటగాళ్లు తమ సత్తా చూపుతారని అభిమానులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మ్యాచ్ వీక్షణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బి గ్రౌండ్‌లో శుభంగిల్ బ్యాటింగ్ ప్రాక్టీసు


ఇంగ్లండ్ ఆటగాళ్ల ప్రాక్టీసు


ప్రాక్టీసుకు సిద్ధమవుతున్న సర్ఫరాజ్‌ఖాన్


స్లిప్‌షాట్ ప్రాక్టీసు చేస్తున్న భారత ఆటగాడు

క్రైం... crime news

బాలికను అపహరించుకుపోయిన యువకుడి అరెస్టు, పోక్సో కేసు

హుకుంపేట, ఫిబ్రవరి 1: ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, ఆమెను అపహరించుకుపోయిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ బి.సతీశ్ గురువారం మీడియాకు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలిక అరకులోయలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం చీడిపల్లి గ్రామానికి చెందిన కింతాడ సంతోశ్ అనే యువకుడితో కొద్దికాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్ ద్వారా మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 22వ తేదీన సంతోశ్, ఆ బాలికకు ఫోన్ చేసి చోడవరం రమ్మని చెప్పాడు. దీంతో ఆమె చోడవరం వెళ్లగా, అక్కడి నుంచి తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. కళాశాలకు వెళ్లిన కుమార్తె సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాల్లో వున్న బంధువులను, ఆమె స్నేహితులను వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో మరోసారి పోలీసులను కలిశారు. బాలిక వద్ద వున్న ఫోన్ టవర్ పరిధిని గత నెల 28వ తేదీన ట్రేస్ చేసిన పోలీసులు ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతంలో వున్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. బాపట్ల పోలీసులు మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా బాలిక ఎక్కడ వుందో గుర్తించి వెంటనే అక్కడకు వెళ్లారు. అయితే సంతోశ్ అక్కడి నుంచి పారిపోగా, బాలికను అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న హుకుంపేట పోలీసులు బాపట్ల వెళ్లి బాలికను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా జనవరి 31వ తేదీన సంతోశ్ పాడేరులో సంచరిస్తుండగా హుకుంపేట పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు కిడ్నాప్, చీటింగ్ కేసులు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 1 : మండలంలోని గబ్బాడ సమీపంలో నెల్లిమెట్ట జంక్షన్ వద్ద 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. నెల్లిమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారులో 46 కిలోల గంజాయి బయట పడిందన్నారు. గొలుగొండ మండలం కంఠారం గ్రామానికి చెందిన నడిపింటి భాస్కరరావు, చింతపల్లి మండలం రాళ్లగెడ్డ గ్రామానికి చెందిన వంతల రాములు పరారయ్యారని, కారును సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వృద్ధురాలిని మోసగించిన ఇద్దరు వలంటీర్లతోసహా నలుగురిపై కేసు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 1: కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వృద్ధురాలి వేలి ముద్రలు తీసుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు తస్కరించినట్టు అందిన ఫిర్యాదుపై ఇద్దరు వలంటీర్లు, వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆట్బాడ విభీషణరావు తెలిపారు. మండలంలోని జేవీపాలెం గ్రామానికి చెందిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్.. కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో గత నెల 21వ తేదీన ఎద్దు లక్ష్మి అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లారు. వివరాలు సేకరించిన తరువాత ఆమె వేలి ముద్రలు తీసుకున్నారు. అయితే తన బ్యాంకు ఖాతాలో నుంచి రూ.10 వేలు వేరే వ్యక్తులు డ్రా చేసినట్టు ఆలస్యంగా తెలుసుకున్న వృద్ధురాలు.. గ్రామ టీడీపీ నాయకుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. జేవీపాలెం గ్రామ వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, సైతారుపేటకు చెందిన వీసం రామసోమనాయుడు, వేమగిరికి చెందిన వై.రవి కలిసి వృద్ధురాలి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు తస్కరించినట్టు గుర్తించారు. దీంతో గురువారం కేసు నమోదు చేశారు. కాగా వలంటీర్ల మోసంపై ఈవోపీఆర్‌డీ సత్యనారాయణను వివరణ కోరగా, జేవీ పాలెం గ్రామ వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్‌పై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామని చెప్పారు. ఆయన నుంచి రిపోర్టు అందించిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువులు, జీవాలతో అదనపు ఆదాయం

» అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ నర్సింహులు

రావికమతం, ఫిబ్రవరి 1: పాడి పశువులు, జీవాల పోషణలో రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించేలా పశువైద్యులు, గోపాల మిత్రలు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.నర్సింహులు సూచించారు. పశువైద్యాధికారులు, గోపాల మిత్రలతో గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయం తరువాత పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు ఆదాయాన్ని ఇస్తుంటాయని, అందువల్ల వీటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన ఆదాయం పొందగలుగుతారని చెప్పారు. ఈ సమావేశంలో రావికమతం ఏడీ టి.పుష్ప, తట్టబంద, కొత్తకోట పశువైద్యాధికారులు జి.నూకేశ్వరరావు, బాల తేజ పాల్గొన్నారు.

తాగునీటి పథకం పైపులు దగ్ధం

నర్సీపట్నం, ఫిబ్రవరి 1: పెదబొడ్డేపల్లిలో సమగ్ర తాగునీటి పథకానికి సంబంధించిన ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నిల్వ చేసిన ఈ పైపుల నుంచి గురువారం సాయంత్రం మంటలు లేచాయి. దట్టమైన పొగలు కమ్మేయడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇక్కడ పేరుకు పోయిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల మంటలు ఎగిసి ప్లాస్టిక్ పైపులకు వ్యాపించి ఉంటాయని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మొత్తం 43 పైపులు దగ్ధం కావడంతో రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

'డీఎస్సీ పోస్టులు పెంచాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: ప్రభుత్వం డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడం హర్షణీయమని, అయితే 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిల్లో నాలుగో వంతు పోస్టులు మాత్రమే భర్తీ చేయడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు అల్లు రాజు, పాంగి చలపతి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చంద్రబాబు సభకు భారీగా జనసమీకరణ

» నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

కె.కోటపాడు, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన మండలంలోని గొండుపాలెంలో 'రా కదలి రా!' నినాదంతో నిర్వహించే బహిరంగకు హాజరై ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. గురువారం కూండ్రవానిపాలెంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు తరలి వచ్చేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో వున్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండు లక్షలకుపైగా జన సమీకరణ చేయాలన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకర్గాల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించడానికి ఈ బహిరంగ సభ నాంది పలకాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, కేఎస్ఎన్ఎస్ రాజు, గండి బాబ్జీ, గవిరెడ్డి రామానాయుడు, నియోజకర్గాల ఇన్‌చార్జిలు పీవీజీ కుమార్ (మాడుగుల), ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), బత్తుల తాతయ్యబాబు (చోడవరం), సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, దాడి రత్నాకర్, గూనూరు మల్లునాయుడు, జనసేన చోడవరం ఇన్‌చార్జి పీఎస్ఎన్ రాజు, రాయపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట దళితుల ధర్నా

» దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేయలేదని ఆరోపణ

మాడుగుల, ఫిబ్రవరి 1: తన పొలంలో చెట్లను నరికివేయడమే కాకుండా, తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు కేసు నమోదు చేయలేదంటూ మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన దళితుడు యర్రంశెట్టి శ్రీను, మాలమహానాడు (పీవీ రావు) నాయకులు గురువారం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి శ్రీను మీడియాకు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనుకు 1993లో సర్వే నంబరు 134/7లో రెండు ఎకరాల 12 సెంట్ల భూమికి రెవెన్యూ అధికారులు డి.పట్టా అందజేశారు. ఇందులో మామిడి, చింత, ఇతర చెట్లను నాటుకుని ఫలసాయం పొందుతున్నాడు. కాగా ఇటీవల సమగ్ర రీసర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు... ఇదే సర్వే నంబరులో మారాజు అప్పారావు అనే వ్యక్తికి 70 సెంట్లకు సంబంధించి డి.పట్టా మంజూరు చేశారు. ఈ విషయం శ్రీనుకు తెలియదు. కాగా రెవెన్యూ అధికారులు తనకు పంపిణీ చేసిన భూమిలో వున్న మామిడి, చింత చెట్లను రెండు రోజుల క్రితం అప్పారావు నరికివేస్తుండగా.. తన భూమిలో చెట్లు ఎందుకు నరుకుతున్నావని శ్రీను ప్రశ్నించాడు. దీంతో అప్పారావు, మరి కొంతమంది కలసి శ్రీనుపై దాడికి పాల్పడ్డారు. అనంతరం శ్రీను పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రెండు రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో గురువారం ఆందోళనకు దిగారు. దీనిపై ఎస్ఐ దామోదరనాయుడుని వివరణ కోరగా.. ఇరువర్గాల చేసిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు (పీవీ రావు) జిల్లా అధ్యక్షుడు వేచలపు సహదేముడు, ప్రధాన కార్యదర్శి రెల్లి తాతారావు, నాయకులు కె.వెంకటరమణ, గాలి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించిన ఆందోళనకారులు

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగింపు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, అక్రమంగా నిర్మించిన ఇళ్లను అధికారులు గురువారం కూల్చివేత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులకు, ప్రభుత్వ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది.

మండలంలోని మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, తారకరామకాలనీలోని సర్వే నంబరు 353, 354/1, 357లలో స్థలాలను ఆక్రమించి సుమారు 100 షెడ్‌లను నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్వో నాగరాజు.. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టవద్దని ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. అయితే స్థానిక వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో వీఆర్వో ఆదేశాలు బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై పత్రికల్లో కథనాలు రావడం, రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు తగు ఏర్పాట్లు చేసుకుని, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ట్రైనీ డీఎస్పీ భవ్య ఆధ్వర్యంలో అనకాపల్లి, నర్సీపట్నం సబ్ డివిజన్‌ల నుంచి సుమారు 70 మంది పోలీసులు, రెవెన్యూ సిబ్బంది.. ఎక్స్‌కవేటర్లతో వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు చేపట్టారు. దీంతో పలువురు ఆక్రమణదారులు యంత్రాలకు అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. పోలీస్ సిబ్బంది వారిని పక్కకు లాగేసి ఇళ్లను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఆర్ఐ మూర్తి, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.


షెడ్‌లను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

» సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


శిక్షణ పూర్తి చేసుకున్న యువతతో సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 1: సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. సింహాద్రి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపీఈటీ)లో నిర్వాసిత గ్రామాల యువతకు మెషిన్ ఆపరేటర్-ఇంజక్షన్ మౌల్డింగ్ అండ్ ప్లాస్టిక్ ప్రొసెసింగ్‌పై ఆరు నెలల పాటు 30 మందికి ఇవ్వనున్న శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. గత బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువపత్రాలతోపాటు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి అధికారులు బీబీ పాత్ర, కె.ప్రకాశరావు, సీపీఈటీ జాయింట్ డైరెక్టర్ శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

'సబ్బవరం'లో బర్డ్ లఖ్‌నవూ బృందం పర్యటన


జాగృతి సొసైటీ ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కేంద్రం వద్ద సిబ్బందితో బర్డ్ లఖ్‌నవూ బృందం సభ్యులు

సబ్బవరం, ఫిబ్రవరి 1: మండలంలో గురువారం బర్డ్ (బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) లఖ్‌నవూ బృందం సభ్యులు పర్యటించారు. ముందుగా జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని సందర్శించి దాని పని తీరును అడిగి తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తి కేంద్రాలకు నాబార్డు ఎంతో సహకరిస్తుందని జాగృతి ఎండీ కందర్ప సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, సీఈవో గొంప రమణ, నాబార్డు డీజీఎం సంజయ్‌రామన్, వైజాగ్ డీసీసీబీ డీజీఎం ఎం.అశోక్‌కుమార్, జాగృతి సీఈవో మౌక్తిక, రైతులు పాల్గొన్నారు.

దుర్గమాంబ పీఏసీఎస్ సేవలు భేష్

సబ్బవరం దుర్గమాంబ పీఏసీఎస్ రైతులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని బర్డ్ లఖ్‌నవూ ప్రోగ్రాం డైరెక్టర్ ప్రశాంత్ దూబే పేర్కొన్నారు. 30 మంది సభ్యులతో కలిసి ఆయన పీఏసీఎస్‌ను సందర్శించి దాని ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ అభివృద్ధిని బృందం సభ్యులకు సీఈవో గొంప రమణ వివరించారు.

వంటా వార్పుతో న్యాయవాదుల నిరసన


కోర్టు ముందు వంట చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: భూ హక్కుల చట్టం రద్దును కోరుతూ రిలే నిరాహారదీక్ష చేస్తున్న న్యాయవాదులు గురువారం ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సూర శ్రీనివాసరావు, కుమార్, రాపేటి బాలగంగాధర్‌తిలక్, రమణయ్య, అడపా సుధాకర్, కొయిలాడ గంగాధరరావు, వెంకటరెడ్డినాయుడు, నూకరాజు, దుర్గాభవాని, అనిత, ప్రసన్న పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు సమ్మె విరమణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: గత కొద్ది రోజులుగా సమ్మె బాట పట్టిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు తమ సమ్మెను విరమించినట్టు తెలిపారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ఏపీడీ డైజీకి సమ్మె విరమణ లేఖను గురువారం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడంతో సమ్మె విరమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు డి.నానిబాబు, ఎస్.శ్రీనివాస్, ప్రకాశ్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో డైట్ కళాశాల ఎంవోయూ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పండిట్ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో డైట్ కళాశాల ఇటీవల ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం రవిశంకర్ చేతుల మీదుగా జరగడం తమ అదృష్టంగా భావిస్తున్నామని కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించుకోవడానికి వివిధ కార్యక్రమాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అసోసియేట్ డీన్ (అకడమిక్) కృష్ణనాగు, ప్లేస్‌మెంట్ అధికారి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రవిశంకర్ నుంచి ఒప్పంద పత్రాలు అందుకుంటున్న రత్నాకర్

ఢిల్లీకి కాంగ్రెస్ నాయకులు పయనం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో శుక్రవారం ఢిల్లీలో జరిగే ధర్నాకు అనకాపల్లి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు బయలుదేరారు. వీరిలో అనకాపల్లి నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోశ్, ఎలమంచిలి నియోజకవర్గం నుంచి తనకాల అనంతరావు, పెందుర్తి నియోజకవర్గం నుంచి ఆడారి రమేశ్, పాయకరావుపేట నుంచి శంకర్, యువజన కాంగ్రెస్ నాయకుడు షేక్ షఫీ తదితరులు వున్నారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్: లోకనాథం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్‌లో లేవన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గాని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితుల విషయం గాని ప్రస్తావన లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి తదితర ఏ అంశాలు ఈ బడ్జెట్‌లో లేకపోవడమంటే ఆంధ్రా ప్రజలను వంచించడమే అవుతుందన్నారు.

93 గ్రామాల్లో బెల్లం తయారీ అంచనా ప్రయోగాలు

మునగపాక, ఫిబ్రవరి 1: దేశంలో ఎగుమతి, దిగుమతుల అవసరాల నిమిత్తం బెల్లం తయారీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంచనా కోసం చెరకు బెల్లం తయారీ అంచనా ప్రయోగాలు చేపట్టినట్టు ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ జి.రామారావు తెలిపారు. మండలంలోని అరబుపాలెం గ్రామంలో గురువారం బొడ్డేడ రామచంద్రరావు రైతు పొలంలో బెల్లం తయారీపై అంచనా ప్రయోగాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 93 గ్రామాలను ఎంపిక చేసి ఒక్కో గ్రామంలో రెండు ప్రయోగాలు చొప్పున పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ ప్రయోగాల వల్ల దిగుబడి అంచనాలు తెలుస్తుందని, దీని వల్ల దేశవ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులలో ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వర్మ, ఉప గణాంక అధికారులు భవాని, శశికళ, వైకుంఠరావు, చంద్రమౌళి, వ్యవసాయ సహాయకులు వానపల్లి సత్య రవిరాజ్, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సమరమే..

... 5వ పేజీ తరువాయి

భారత్ బ్యాటింగ్ ఆధారపడి ఉంది. స్పిన్నర్లే ప్రధాన అస్త్రాలుగా ఇరు జట్లు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. తొలి టెస్టులో ఇంగ్లండ్ స్పిన్నర్ టామ్ హార్డ్‌లీ బౌలింగ్‌లో భారత్ బ్యాట్స్‌మెన్లు తడబడ్డారు. హార్డ్‌లీకి బషీర్ తోడు కావచ్చు. ఇక భారత్ స్పిన్నర్ అశ్విన్‌కు ఇక్కడి పిచ్‌పై మంచి రికార్డు ఉంది. జడేజా స్థానంలో సిరాజ్ ఆడే అవకాశాలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ కీలకంగా మారనున్నది. రెండో రోజు నుంచి పిచ్ స్వభావం మారే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు.

వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాంబిల్లి, ఫిబ్రవరి 1 : వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసేన పార్టీ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బైలపూడి రామదాసు అన్నారు. గురువారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన రాంబిల్లి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున నాయకులు, జనసైనికులు వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, మండల పార్టీ కార్యదర్శి చోడిపల్లి ప్రసాద్, రుత్తల శ్రీను పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

మునగపాక, ఫిబ్రవరి 1: మండలంలోని వాడ్రాపల్లిలో గురువారం రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందరంగా అధికారులు ప్రతి రైతు విత్తనశుద్ధి ఎలా చేసుకోవాలో ప్రయోగాత్మకంగా పొలాల్లో వివరించారు. విత్తనాలతోపాటు పంట నాణ్యత బాగుండాలంటే ఏ సమయంలో ఏ ఎరువులు వాడాలో వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఏవో తులసీమణి, ఏఈవో ఎస్. సాయివాణి, మళ్ల జోగారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ నమూనా పరీక్ష

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం టెన్త్ నమూనా పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిఏటా నిర్వహిస్తున్నట్టుగా గురువారం పట్టణంతోపాటు మండల గ్రామాల్లోని అన్ని పాఠశాలల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సహాయ కార్యదర్శి ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాయకరావుపేటలో పవర్ కట్

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. తాండవ చక్కెర కర్మాగారం వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలు మార్పు, చెట్ల కొమ్మలు తొలగించడం కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోని దుర్గాకాలనీ, ఇందిరాకాలనీ, అంబేడ్కర్‌కాలనీ, లింగాలతోట కాలనీ, రాజీవ్‌నగర్, దుర్గానగర్, శాంతినగర్, మండలంలోని పీఎల్.పురం, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఊర చెరువు సర్వే పనులు ప్రారంభం

పరవాడ, ఫిబ్రవరి 1 : స్థానిక ఊర చెరువు సర్వే పనులను రెవెన్యూ సిబ్బంది గురువారం ప్రారంభించారు. చెరువు విస్తీర్ణం ఎంత మేర ఉందో హద్దులను గుర్తించి సర్వే రాళ్లను పాతారు. పనులను సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు పరిశీలించారు. సర్వే పూర్తయిన వెంటనే దెబ్బతిన్న చెరువు గట్టు పనులను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు వారు సూచించారు. ఫార్మా రసాయన వ్యర్థాలు చెరువులోకి రానీయకుండా సరిహద్దులు మార్చాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ్, వీఆర్వో వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు పైలా హరీష్, గండి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, ఫిబ్రవరి 1 : స్థానిక 11/33 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఆడారి తులసీరావు విగ్రహావిష్కరణ

» డెయిరీ ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్లు
» విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ప్రకటన



తులసీరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించినంతరం నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఫిబ్రవరి 1: విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు వేలాది రైతు కుటుంబాల్లో వెలుగులు నింపారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం ఎలమంచిలిలోని తులసీఘాట్ వద్ద ఆడారి తులసీరావు జయంతి సందర్భంగా తీర్థాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరావు కాంస్య విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, డెయిరీ ఉద్యోగులు, వేలాది మంది అభిమానులు మధ్య ఆనంద్, మళ్ల విజయ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్యాల నాయుడు మాట్లాడుతూ విశాఖ డెయిరీని అత్యున్నతంగా తీర్చిదిద్దిన ఘనత తులసీరావుదేనన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ మాట్లాడుతూ తన తండ్రి తులసీరావు ఆశయ సాధనకు డెయిరీని మరింత ముందుకు తీసుకువెళతానన్నారు. తన తండ్రి జయంతి సందర్భంగా డెయిరీ ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. తొలుత ఎలమంచిలి పట్టణం నుంచి తులసీఘాట్‌కు ఆడారి తులసీరావు చిత్రపటాన్ని ఊరేగింపుగా ఘాట్‌కు తీసుకువచ్చారు. తీర్థం సందర్భంగా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ గఫూర్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యూవీ.రమణమూర్తి రాజు, గొల్ల బాబూరావు, మళ్ల విజయ్‌ప్రసాద్, డెయిరీ జీఎం వెంకటరమణ, డైరెక్టర్లు, అనుచరులు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీలో విజేత దేవరాపల్లి జట్టు

తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పందెం పోటీల్లో 21 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో దేవరాపల్లికి చెందిన జైవీరాంజనేయ ఎద్దులు ప్రథమ విజేతగాను, నర్సాపురానికి చెందిన బూర తేజశ్రీ ద్వితీయ స్థానాన్ని, కేజేపురానికి చెందిన శ్రీఆంజనేయం జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పోటీల్లో 9 స్థానాలు దక్కించుకున్న వారందరికీ నగదు, మెమొంటోలను ముత్యాలనాయుడు, ఆడారి ఆనంద్ అందజేశారు.

జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు అవస్థలు

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, ఫిబ్రవరి 1 : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలో మగ్గుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. గురువారం పట్టణంలోని గవరపాలెం, ముత్రాసుకాలనీల్లో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల బతుకు భారంగా మారిందన్నారు. పెంచిన ధరలతో కుటుంబపోషణకు అవస్థలు పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు బాసటగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, దూలం రాంప్రసాద్, కర్రి మల్లేశ్వరరావు, బుద్ద రాజు, బొడ్డేడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో టీడీపీ ఇంటింటి ప్రచారం

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 : బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు మునసబుగారివీధి, పోసినవారివీధి, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరపు మహలక్ష్మి, మలిపెద్ది సతీశ్ పాల్గొన్నారు.

స్థానికులకే పాయకరావుపేట టిక్కెట్

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి



సమావేశంలో మాట్లాడుతున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 : రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గం టికెట్ స్థానికులకే కేటాయించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి డిమాండ్ చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ అంగూరి శివకుమారి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానికులకు టికెట్ ఇవ్వడం వలన నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి శివకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, నాలుగు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు ఎగదాసి నానాజీ, వెలగా సుధాకర్, పప్పల శివ, సింగంపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు గెడ్డం చైతన్య, పల్లి దుర్గారావు, జగ్గన్నదొర, నారపురెడ్డి పద్మ, ఆచంట గోపి, కోసూరి నాని తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి

» జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కొత్తూరు, ఫిబ్రవరి 1 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. గురువారం అనకాపల్లిలో పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేసి, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసేలా చేశామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బీవీఎస్. వర్మ, కార్యదర్శి పట్టాభి ప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా నాయకుడు రవిరాజు, మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, సీనియర్ నాయకులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ ప్రారంభం

పరవాడ, ఫిబ్రవరి 1: ఫార్మాసిటీలో గురువారం వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో పేరుతో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. బల్క్ యూనిట్ స్పెషాలిటీ ప్రొడక్ట్ ఎక్స్‌ప్లోరా అధ్యక్షుడు అనంత్‌బర్‌బాదికర్, శ్రావణ్ షిప్పింగ్ చైర్మన్ వి. సాంబశివరావు, లారస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీవీ లక్ష్మణరావు ముఖ్యఅతిథులు పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజులు పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎఎస్ఆర్ఎం అధ్యక్ష, కార్యదర్శులు శివరామప్రసాద్, జెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

కోటవురట్లను కమ్మేసిన పొగమంచు



కోటవురట్లలో కురుస్తున్న పొగమంచు

కోటవురట్ల, ఫిబ్రవరి 1: మండలంలోని పలు గ్రామాల్లో పొగమంచు తీవ్రత తగ్గలేదు. సంక్రాంతి పండుగ దాటి 15 రోజులు అవుతున్నా పొగమంచు తీవ్రత పెరగడంతో పగటి ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గురువారం తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. జనం ఉదయాన్నే పనులు చేసుకునేందుకు బయటకు రాలేకపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు జ్వరం, జలుబులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల మామిడి పూతకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయండి

రాంబిల్లి, ఫిబ్రవరి 1: సీపీఎస్ రద్దు కోరుతూ ఈనెల 4న విశాఖపట్నంలో ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో జరిగే సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. గురువారం గోకివాడలో ఆయన పలువురు ఉపాధ్యాయులతో కలిసి సాగర సంగ్రామ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ జీపీఎస్ అనే మోసపూరిత విధానాన్ని తీసుకువచ్చి ఉద్యోగులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణారావు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పాల్గొన్నారు.

దిశ పోలీస్ స్టేషన్ సీఐ దీనబంధు బాధ్యతల స్వీకారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1 : అనకాపల్లి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా డి.దీనబంధు గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. 2009లో ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన దీనబంధుకు ఇటీవల సీఐగా పదోన్నతి లభించింది. గురువారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన లక్ష్మీ విశాఖ రేంజ్‌కు బదిలీ అయ్యారు.

ఎన్నాళ్లు ప్రజలకు నరకం చూపిస్తారు : పైడారావు

మునగపాక, ఫిబ్రవరి 1: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులు చేయకుండా ఎన్నాళ్లు ప్రజలకు నరకం చూపుతారని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20 గ్రామాల ప్రజలకు కీలకమైన ఈ రోడ్డు గురించి అధికార పార్టీ నాయకులకు పట్టకపోవడం దారుణమన్నారు. అధికార పార్టీ నాయకులు వర్గపోరుపై చూపుతున్న శ్రద్ధ ప్రజలకు అవసరమైన ఈ రోడ్డుపై చూపితే ఎంతో బాగుంటుందని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతిరోజు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నా వారికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రోడ్డు మరమ్మతులు చేయించలేని ఈ నాయకులు ప్రజలకు ఇంకేం చేస్తారని ఎద్దేవా చేశారు.

వేంపాడు పంచాయతీ సెక్రటరీకి సన్మానం

నక్కపల్లి, ఫిబ్రవరి 1: గణతంత్ర వేడుకల్లో ఉత్తమ పురస్కారం పొందిన వేంపాడు పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావును గురువారం గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏడిద నూకరత్నం, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అయినంపూడి మణిరాజు, ఉపసర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు టెన్త్ విద్యార్థులు విద్యా దీక్ష

ఎలమంచిలి, ఫిబ్రవరి 1: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జంపపాలెం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో గురువారం నుంచి విద్యా దీక్షను చేపట్టారు. అత్యధిక సమయం చదువు కేటాయించి, మెరుగైన మార్కులు సాధించాలని నిర్ణయించారు. ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి, ఉపాధ్యాయులందరి సమక్షంలో విద్యార్థులు కంకణాలు కట్టుకుని దీక్షను చేపట్టారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 1: మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీలో గురువారం ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పీహెచ్‌సీకి వస్తున్న రోగులను సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి శక్తిప్రియ, సర్పంచ్ కురందాసు గణేష్, మాజీ సర్పంచ్ వజ్రపు శంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1 : భారత్ వికాస్ పరిషత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్టు పరిషత్ అధ్యక్షుడు ఎ. ఓంరామ్ తెలిపారు. గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు పాఠశాలల నుంచి 180 మంది వరకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి వర్మ, సప్తాహ్ కన్వీనర్ వై. కేశవరావు, ప్రోగ్రాం కన్వీనర్ ఎం. ఉమామహేశ్వరరావు, కో-కన్వీనర్ ఎస్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రోడ్డుకు మరమ్మతులు చేయాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1 : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలని ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రోడ్డులో అనేక గ్రామాల ప్రజలు రోజూ అనకాపల్లికి రావాలన్నా.. తిరిగి వెళ్లాలన్నా.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దారి పొడవున రహదారి దెబ్బతిందన్నారు. తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఈయన డిమాండ్ చేశారు.

గోపాలమిత్ర రామారావుకు సన్మానం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 1: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రశంసాపత్రం తీసుకున్న గోపాలమిత్ర కర్రి రామారావుని తోటి గోపాలమిత్రలు గురువారం సన్మానించారు. దుప్పితూరు గోపాలమిత్రగా పనిచేస్తున్న కర్రి రామారావు 2008, 2009ల్లో వరుసగా బెస్ట్ గోపాలమిత్రగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. 2021 నేషనల్ గోపాలరత్న అవార్డు, 2023లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ కందుల సుబ్రహ్మణ్యం, గోపాలమిత్రలు ఎ.అప్పారావు, ఏ.కామేశ్వరరవు, బి.అప్పారావు, ఎస్ఎస్ఎస్ ప్రకాశరావు, ప్రయకృష్ణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి రోడ్డు అభివృద్ధికి సంతకాల సేకరణ



తిమ్మరాజుపేటలో సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 1: శిథిలమైన అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు అభివృద్ధి కోసం సీపీఎం నాయకులు గురువారం తిమ్మరాజుపేట జంక్షన్‌లో సంతకాల సేకరణ చేశారు. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో తరచూ వాహన ప్రమాదాలు జరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి కొత్త రోడ్డు వేయాలని వీరు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రొంగలి రాము, కర్రి అప్పారావు, కె. రామసదాశివరావు, రామకృష్ణ, శరగడం శివబాపునాయుడు, జగ్గారావు, కన్నంనాయుడు, బుద్ద రంగారావు పాల్గొన్నారు.

'గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

రాంబిల్లి, ఫిబ్రవరి 1: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. గురువారం వెంకటాపురంలో తడిచెత్త, పొడిచెత్తలను వేసుకొనేందుకు డస్ట్‌బిన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలో పారిశుధ్య సమస్య లేకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్పీటీసీ సభ్యుడు దూళి నాగరాజు, ఎంపీపీ శిరీష, ఈవోపీఆర్డీ రాజు, వెంకటాపురం, హరిపురం సర్పంచులు కిల్లాడ తాతబ్బాయి, డి.అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలి

నక్కపల్లి, ఫిబ్రవరి 1: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో కూలీలకు పనుల్లేవని, తక్షణమే ఉపాధి హామీ పనులను ప్రభుత్వం ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం గునిపూడిలో పలువురు ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరువు మండలంగా ప్రకటించడంలో కూడా ప్రభుత్వం తాత్సారం చేసిందని, కనీసం ఉపాధి పనులు ప్రారంభిస్తే కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ రాజేశ్, మాజీ సర్పంచ్ మాసా జోగారావు, వాతాడ అప్పారావు, మాసా యేసుబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన సూర్యనారాయణ

» ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు



వెంకట సూర్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

రాంబిల్లి, ఫిబ్రవరి 1: విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసే నీరుకొండ సూర్యనారాయణ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు అన్నారు. గురువారం ఉపాధ్యాయుడు నీరుకొండ వెంకట సూర్యనారాయణ స్వచ్ఛంద పదవీవిరమణ సందర్భంగా గోకివాడలో ఆయన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, పలువురు ప్రజాప్రతినిధులు సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లాల నాయకులు సూర్యనారాయణ ఉపాధ్యాయుడిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు, ఎంపీపీలు జి.శిరీష, బోదెపు గోవింద్, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో తాగునీటి కొళాయిలు బంద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 1 : మునిసిపాలిటీకి ప్రధాన తాగునీటి వనరు అయిన పెనుగొల్లు వద్ద మెయిన్ పైపులైను మరమ్మతుకు గురవవ్వడంతో శని, ఆదివారాలు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు మునిసిపల్ అధికారులు తెలిపారు. ఈ కారణంగా మునిసిపాలిటీలో 4వ వార్డు నుంచి 19, 25 వార్డులకు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వారు తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డుకు తూట్లు పొడిచిన వైసీపీ ప్రభుత్వం : కోన లక్ష్మణ

తుమ్మపాల, ఫిబ్రవరి 1 : కార్మికుల సంక్షేమ బోర్డుకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఏపీ భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ విమర్శించారు. గురువారం పలు గ్రామాల్లో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు దారి మళ్లించి కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తక్షణమే నిధులను జమ చేసి, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మూలపేట గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా కోన లక్ష్మణ, అధ్యక్షుడుగా సీహెచ్. అప్పలరాజు, కార్యదర్శిగా మారేడుపూడి సత్యనారాయణ, కోశాధికారిగా గుమ్మాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్. సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా సీహెచ్.గణేష్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సబ్బవరం ఎస్ఐ ధనుంజయ్ బాధ్యతల స్వీకారం

సబ్బవరం, ఫిబ్రవరి 1: సబ్బవరం పోలీసు స్టేషన్ ఎస్ఐగా రాజాన ధనుంజయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పెదరాంభద్రపురం హైస్కూల్‌కు ప్రవాసాంధ్రుల భారీ విరాళం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్, లేజర్ ప్రింటర్, ఉపాధ్యాయుల రాక్‌లను సమకూర్చేందుకు ప్రవాసాంధ్రులు నోరి నరసింహం, లక్ష్మీమంగ దంపతులు రూ.1లక్ష, వారి కుమార్తె నోరి మైథిలి రూ.50వేలు విరాళంగా అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం కోడి శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు నోరి కుటుంబ సభ్యులు ఈ మొత్తాన్ని అందజేశారు. గతంలో నోరి దంపతులు దార్లపూడి, వేంపాడు, ఉద్దండపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్యూయల్ డెస్కులు, టేబుల్స్ కుర్చీలు, ప్లేగ్రౌండ్ తయారీ, డైనింగ్ హాలు నిర్మాణానికి లక్షలాది రూపాయలను విరాళంగా అందజేశారు. హైస్కూల్‌లో మౌలిక సదుపాయల కల్పనకు విరాళమిచ్చిన నోరి దంపతులకు హెచ్ఎం కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 1: కోటవురట్లలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్లలో గవ్వా ఈశ్వరరావు ఎలక్ట్రికల్ అండ్ రివైండింగ్ షాపు నడుపుతున్నాడు. గురువారం పది గంటలకు ఈశ్వరరావు డీసీసీబీ బ్యాంకుకు పని మీద సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా బైక్‌పై వెళుతున్న పినపాత్రుని మోక్షిత్ అనే యువకుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు తలకు బలంగా గాయమైంది. వెంటనే కోటవురట్ల ఆస్పత్రికి తరలించగా.. ఈశ్వరరావు అప్పటికే కోమాలోకి వెళ్లిపోయారు. ఆయన్ని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

కోడి పందేలు, గుల్లాటపై దాడి

ఎలమంచిలి, జనవరి 1: ఎలమంచిలిలో గురువారం నిర్వహించిన తీర్థంలో నిర్వహించిన కోడి పందేలపై పోలీసులు దాడి చేసి నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. అలాగే ఏడు లాటరీ బల్లలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. కోడి పందేలకు స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు వచ్చినట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసినట్టు తెలుస్తోంది.

గ్రామ వలంటీర్ హత్య?

... 5వ పేజీ తరువాయి

ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో స్నేహితుల వద్ద వుండి వుంటాడని ఈశ్వరమ్మ భావించింది. కాగా ఉదయం పది గంటలైన హరినాథ్ పింఛన్ డబ్బులు పంపిణీ చేయకపోవడంతో పంచాయతీ అధికారులతోపాటు వైసీపీ నాయకులు ఆరా తీశారు. అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్చాఫ్ అని వస్తున్నది. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటి తరువాత పంట పొలాల్లో హరినాథ్ మృతిచెంది వుండడాన్ని గుర్తించిన ఒక రైతు గ్రామంలోకి వచ్చి విషయం చెప్పాడు. పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామ పెద్దలు.. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హరినాథ్ రక్తపు మడుగులో పడి వున్నాడు. ఎస్ఐ రామకృష్ణారావు వచ్చి పరిశీలించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, సీఐలు హరి, గణేశ్ వచ్చి వివరాలు సేకరించారు. హరినాథ్ ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో గ్రామస్థులు, పోలీసులు హత్యగా అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

'భవిత కేంద్రాల్లో బోధన చక్కగా సాగాలి'


భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న శకుంతల

మాకవరపాలెం, ఫిబ్రవరి 1 : భవిత కేంద్రాల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చక్కగా చేపట్టాలని అనకాపల్లి జిల్లా ఐఈడీ కో-ఆర్డినేటర్ బి.శకుంతల సూచించారు. మాకవరపాలెంలోని భవిత కేంద్రాన్ని గురువారం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

నాతవరం, ఫిబ్రవరి 1 : తూర్పు కాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మాధవనగరానికి చెందిన గంటా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి నుంచి నియామక పత్రం అందుకున్నారు.

గిరిజన బాలునికి ఆర్థిక సాయం

నాతవరం, ఫిబ్రవరి 1 : ఆసనగిరిలో అనారోగ్యంతో బాధపడుతున్న పాండవులు సీతయ్య కుమారుడు ఆరేళ్ల బలరాంకు నాతవరానికి చెందిన శారదా లలితా పారాయణ గ్రూప్ ఫౌండేషన్ ప్రతినిధి యర్రా సూర్యప్రకాష్, భారతి, ఉపాధ్యాయుడు గోపాలకృష్ణ, సామాజిక సేవా కార్యకర్త యాగం గౌతమ్‌లు గురువారం ఆర్థిక సాయం అందించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా!

- గెడ్డలు, వాగుల్లో గుట్టుగా తవ్వకాలు
- ఎడ్ల బండ్లపై తరలించి వ్యాపారం
- కన్నెత్తి చూడని పోలీస్, రెవెన్యూ యంత్రాంగం


కృష్ణాదేవిపేటలో ఎడ్ల బండ్లపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 1 : గొలుగొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. కొంగసింగి, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, రత్నంపేట గ్రామాలకు చెందిన ఎడ్లబండ్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా తంతు సాగిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. చోద్యంలోని బొడ్డేరు గెడ్డ, కొయ్యూరు మండలం రామ్‌నగర్, కొత్తూరు తదితర వాగుల్లో ఇసుకను గుట్టుగా తవ్వి రోజుకు పదుల సంఖ్యలో సదరు బండ్లపై రవాణా సాగిస్తున్నారు. ఒక్కో బండి ఇసుకను రు.వెయ్యి చొప్పున విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యాపారం ఇంత జోరుగా సాగుతున్నా పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఇసుక అక్రమ తరలింపుపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

గ్రామ వలంటీర్ హత్య?

... 5వ పేజీ తరువాయి


రోదిస్తున్న తల్లి ఈశ్వరమ్మ

ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో స్నేహితుల వద్ద వుండి వుంటాడని ఈశ్వరమ్మ భావించింది. కాగా ఉదయం పది గంటలైన హరినాథ్ పింఛన్ డబ్బులు పంపిణీ చేయక పోవడంతో పంచాయతీ అధికారులతోపాటు వైసీపీ నాయకులు ఆరా తీశారు. అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తున్నది. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటి తరువాత పంట పొలాల్లో హరినాథ్ మృతిచెంది వుండడాన్ని గుర్తించిన ఒక రైతు గ్రామంలోకి వచ్చి విషయం చెప్పాడు. పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామ పెద్దలు.. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హరినాథ్ రక్తపు మడుగులో పడి వున్నాడు. ఎస్ఐ రామకృష్ణారావు వచ్చి పరిశీలించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, సీఐలు హరి, గణేశ్ వచ్చి వివరాలు సేకరించారు. హరినాథ్ ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో గ్రామస్థులు, పోలీసులు హత్యగా అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

వారసులను కాదని వేరొకరికి ఎఫ్ఎంసీ ఇచ్చారని ఆందోళన

నాతవరం, ఫిబ్రవరి 1 : మండలంలోని మర్రిపాలేనికి చెందిన గొల్లు పార్వతి, అల్లు సింహాచలం తదితరులు గురువారం నాతవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అల్లు కుటుంబ వారసులమైన తమను తాము కాదని ఇటంశెట్టి దేవుళ్ళమ్మకు రెవెన్యూ అధికారులు కుటుంబ ధ్రువీకరణపత్రం (ఎఫ్ఎంసీ) ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల క్రితం ఈ విషయమై అప్పటి తహసీల్దార్ జానకమ్మ గ్రామంలో పెద్దల సమక్షంలో విచారణ జరిపారన్నారు. అయితే కుటుంబ ధ్రువీకరణ పత్రం మంజూరులో వివాదం ఉండడంతో అప్పట్లో సదరు పత్రం మంజూరు చేయలేదన్నారు. నెల రోజుల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు అల్లు కుటుంబ వారసులమైన తమను కాదని ఇటంశెట్టి దేవుళ్ళమ్మకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారని వీరు ఆరోపించారు. తక్షణమే రద్దు చేసి న్యాయం చేయాల్సిందిగా కోరారు.

62 మందిపై బైండోవర్ కేసులు

- ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్

నర్సీపట్నం, ఫిబ్రవరి 1 : సారా, మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న 62 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబీ) ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ తెలిపారు. ఇటీవల నర్సీపట్నానికి బదిలీపై విచ్చేసిన ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడారు. బైండోవర్ కేసులు నమోదైన వారు నిబంధనలను అతిక్రమించి నేరాలకు పాల్పడితే తహసీల్దార్ వద్ద ప్రవేశ పెట్టి రూ.2లక్షలు జరిమానా విధిస్తామన్నారు. గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 22 వాహనాలను వేలం వేసేందుకు కోర్టు అనుమతి లభించినట్టు చెప్పారు. డిస్పోజిబుల్ కమిటీ పరిశీలనలో ఉందని, త్వరలోనే వేలం ప్రక్రియ చేపడతామని వివరించారు. గత నెలలో సారా, అనధికార మద్యం విక్రయాలకు సబంధించి 48 మందిపై కేసులు పెట్టామన్నారు. అపరిచిత వ్యక్తులకు ఇళ్లు, దుకాణాలు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. గంజాయి, మద్యం అక్రమ నిల్వలు ఉంటే సదరు ఇంటి యజమాని కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. అలాగే, బైక్‌లు, కార్లు ఇతరులకు వాడుకోవడానికి ఇవ్వడం మంచిది కాదన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు గంజాయి రవాణాకు సహకరించడం చాలా కేసుల్లో చూస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

కొత్త అధికారులు బాధ్యతల స్వీకరణ

పట్టణ సీఐగా కాంతికుమార్


కాంతికుమార్

నర్సీపట్నం, ఫిబ్రవరి 1 : పట్టణ సీఐగా టి.కాంతికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన ఎక్కువ కాలం విజయనగరంలో పనిచేశారు. అక్కడ ఇంటిలిజెన్స్ విభాగంలో ఎస్ఐగా ఉంటూ పదోన్నతిపై ఇక్కడకు విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న గణేశ్ అనకాపల్లి ఎస్పీ కార్యాలయం కంట్రోల్ విభాగానికి బదిలీ అయ్యారు.

గొలుగొండ ఎంపీడీవోగా రత్నకుమారి



గొలుగొండ: గొలుగొండ ఎంపీడీవోగా డీఎస్ రత్నకుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసి డేవిడ్‌రాజ్‌ను తూర్పుగోదావరి జిల్లాకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

నర్సీపట్నం ఎంపీడీవోగా జాన్ లింకన్



నర్సీపట్నం అర్బన్ : నర్సీపట్నం ఎంపీడీవోగా కె.జాన్ లింకన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న జయమాధవి తూర్పుగోదావరి జిల్లా కోటనందూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

నాతవరం ఎంపీడీవోగా రాంబాబు


రాంబాబుకు సిబ్బంది స్వాగతం

నాతవరం : నాతవరం ఎంపీడీవోగా జె.రాం బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు.

బదిలీపై వెళుతున్న తహసీల్దార్ ప్రసాదరావుకు సన్మానం


ప్రసాదరావును సన్మానిస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎంవీవీ ప్రసాదరావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం ఆయనకు సిబ్బంది ఇక్కడ ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, సర్వే విభాగం డీటీ శ్రీరామ్మూర్తి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్‌వోలు, వివిధ పార్టీల నాయకులు ఆయనను సత్కరించారు.

చోడవరం
నియోజకవర్గం

తీర్థాలు, పండగలతో గ్రామీణుల్లో భక్తిభావం : గవిరెడ్డి

చీడికాడ, ఫిబ్రవరి 1: తీర్థాలు, పండగలతో గ్రామీణుల్లో భక్తిభావం పెరుగుతుందని మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన ఉత్సవ నిర్వహణకు రూ.20,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, కోనాం జలాశయం మాజీ ఛైర్మన్ గండి ముసలినాయుడు, కొల్లి సూరినాయుడు పాల్గొన్నారు.

రైతులు సంఘాలుగా ఏర్పడితేనే సబ్సిడీలు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 1: రైతులంతా సంఘాలుగా ఏర్పడితేనే సబ్సిడీతో కూడిన సహకారం అందించగలమని కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. గురువారం కేపీ అగ్రహారంలో జరిగిన రైతు సాధికార సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘాలుగా ఏర్పడిన రైతులకు వ్యవసాయ ఉత్పత్తి పెంచే విధంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. సంఘంలో రైతు రూ.2 వేలు సభ్యత్వ రుసుం చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ముచ్చకర్ల నాగేశ్వరరావు, పూడి రామారావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఫిర్యాదు

రోలుగుంట, ఫిబ్రవరి 1 : పంచాయతీ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న గ్రామ కార్యదర్శి కిరణ్‌పై రోలుగుంట సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి గురువారం ఈవోపీఆర్‌డీ నూకరాజుకు ఫిర్యాదు చేశారు. తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని, మూమెంట్ రిజిస్టర్ కూడా లేదన్నారు. పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేసి నూతన కార్యదర్శిని నియమించాలని కోరారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఫిబ్రవరి 1: చంద్రయ్యపేటలో ఈ నెల 5న టీడీపీ అధినేత హాజరవుతున్న రా.. కదలిరా సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు.గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ, జనసేన ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకుడు మూర్తి యాదవ్, గూనూరు మల్లునాయుడు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, దేవరపల్లి వెంకట అప్పారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మజ్జి గౌరీశంకర్, జనసేన నాయకులు గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వేలు పెన్షన్‌తో గౌరవ జీవనం : బూడి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 1: కుటుంబంలోను, సమాజంలోను వృద్ధులు గౌరవంగా బతకడానికి రూ.మూడు వేలు పెన్షన్ ఉపయోగపడుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మం గారి కల్యాణ మండపం, రావాలమ్మ గుడి వరకు సిమెంటు రోడ్డు, సీసీరోడ్లు, డ్రైన్‌లు, హెల్త్ క్లినిక్, కొళాయిలను ప్రారంభించారు. ఇంటింట తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు అనూరాధ, కర్రి సత్యం, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, బూరే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గవరవరం వంతెనపై చీకట్లు

- విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో మందుబాబుల హడావిడి


చీకటి పడితే గవరవరం వంతెనపై పరిస్థితి

చోడవరం, ఫిబ్రవరి 1: మండలంలోని గవరవరం వద్ద శారదానదిపై నిర్మించిన భారీ వంతెనపై లైట్లు వెలగకపోవడంతో చీకటిమయంగా మారిపోతున్నది. ఈ వంతెనపై పెద్ద లైట్లు ఏర్పాటు చేయడంతో చీకటి పడినా ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనదారులు, స్థానికులు రాకపోకలు సాగించేవారు. అయితే వంతెనపై వేసిన లైట్లు వెలగడం లేదు. దీంతో చీకటి పడితే మందుబాబులు వంతెనను పబ్లిక్ బార్‌గా మార్చేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలతో కలిసి వస్తున్నవారు భయంగా రాకపోకలు సాగిఇస్తున్నారు. వంతెనపై వీధి దీపాలు వెలగకపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వంతెనపై లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకారం


మాడుగుల ఎంపీడీవో కాళీ ప్రసాదరావును అభినందిస్తున్న దృశ్యం

మాడుగుల, బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం, ఫిబ్రవరి 1 : మాడుగుల ఎంపీడీవో ఆర్ కాళీ ప్రసాదరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోకు ఈవోపీఆర్‌డీ మీనా కుమారి, ఎంపీపీ రాజారాం, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బుచ్చెయ్యపేట ఎంపీడీఓగా టీఎస్.వెంకట ఆచార్య గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు బొకెలు అందించి అభినందనలు తెలిపారు. చీడికాడ ఎంపీడీవోగా ఉమామహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కురచా జయమ్మ, వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబును అభినందించారు. చోడవరం ఎంపీడీవోగా టి.రమణీమణి బాధ్యతలు స్వీకరించారు.

మాడుగుల
నియోజకవర్గం

కొత్తపల్లిలో గిరిజన సంస్కృతి యాత్ర


కొత్తపల్లిలో నిర్వహిస్తున్న గిరిజన సంస్కృతి యాత్ర

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 1 : మండలంలోని కొత్తపల్లిలో గురువారం గిరిజన సంస్కృతి యాత్ర కొనసాగింది. వనవాసి కల్యాణాశ్రమం ఆధ్వర్యంలో గత నెల 25న ఒడిశాలోని జైపూర్‌లో ప్రారంభమైన తూర్పు కనుమల్లో గిరిజన సాంస్కృతిక యాత్ర గురువారం మాడుగుల మండలానికి చేరుకుంది. కాశీపురం, కొత్తపల్లి గ్రామాల్లో గిరిజన యాత్ర కొనసాగిందిఇ. ఈ సందర్భంగా యాత్ర ప్రముఖులు నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, హక్కులను కాపాడడం, రక్షణ కల్పించేందుకు భారతీయులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాధర మహంతి, పలువురు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకారం

చోడవరం, ఫిబ్రవరి1: మండల తహసీల్దార్ టి. వేణుగోపాలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా జి. సిగడాం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరిన వేణుగోపాలరావును రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీ అయిన తహసీల్దార్లకు వీడ్కోలు


దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మిని సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది

దేవరాపల్లి, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన తహసీల్దార్ ఎం.లక్ష్మిని మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సిబ్బంది గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సురేశ్, సర్వేయరు గోవిందరాజు, ఆర్ఐ సతీశ్ తదితరులు ఆమె సేవలను కొనియాడారు.

చీడికాడలో.. బదిలీ అయిన తహసీల్దార్ బీవీ.రాణిని గురువారం ఎంపీపీ కురచా జయమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు సన్మానించారు. కార్యక్రమంలో డీటీ రమేష్,ఎంఈవో బొంజుబాబు, రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు ఇంటింటికీ సందర్శన


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న హెచ్ఎం మోహన్‌రావు

రోలుగుంట, ఫిబ్రవరి 1 : పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణ శాతం పెంచేందుకు కుసర్లపూడి జడ్పీ పాఠశాల హెచ్ఎం మోహన్‌రావు ఇంటింటా సందర్శన చేపట్టారు. పాఠశాల పరిధిలో జానకిరాంపురం, కుసర్లపూడి, తమరానపాలెం, రొంగలిపాలెం గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు రాత్రి వేళల్లో వెళుతున్నారు. ఆ సమయంలో సబ్జెక్టుల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేసి, తల్లితండ్రులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి, భయం తగ్గించేందుకు సూచనలు చేస్తున్నారు. మూడు గ్రూపులుగా ఏర్పడి ప్రతీ రోజు రాత్రి సమయాల్లో ఉపాధ్యాయులు విద్యావతి, అప్పన రాంబాబు, నానిబాబు, సత్యనారాయణ, భార్గవి, సత్తిబాబు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలన చేస్తున్నారు.

కిసాన్ క్రెడిట్‌కార్డు రుణాలకు దరఖాస్తులు స్వీకరించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, ఫిబ్రవరి 1: కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలకు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు ఈ.చిట్టినాయుడు కోరారు. గురువారం స్థానిక పశువైద్యకేంద్రంలో పశువైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రుణ రాయితీలు, ఫారాల భర్తీ తదితర వివరాలను తెలిపారు. సమావేశంలో పశువైద్యాధికారులు జి.గాయత్రిదేవి, కేవీఎస్.రాఘవమ్మ, ఎ.గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం కప్పివేసిన వారిపై చర్యలు తీసుకోండి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రభుత్వ భూమితోపాటు, చెరువు స్థలాన్ని గ్రావెల్‌తో కప్పిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు గురువారం స్థానిక డీటీకి వినతిపత్రం సమర్పించారు. చెరువుకు వచ్చే కాలువలను గ్రావెల్‌తో కప్పివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆర్టీసీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, మండల, పట్టణ నాయకులు గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, డీఎస్ నాయుడు, బలిజ మహారాజు, పరవాడ దొరబాబు, మూచర్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

చోడవరం, ఫిబ్రవరి 1: స్థానిక కేశవస్వామి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మారుతీనగర్‌కు చెందిన భక్తులు రెడ్డి పద్మావతి, ఆమె కుమారులు రూ.50,116 విరాళంగా అందజేశారు. గురువారం ఆలయంలో అర్చకులు సుదర్శనం సీతారామాచార్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసమాజంలో తులసీరావు జయంతి వేడుకలు

చోడవరం, ఫిబ్రవరి 1: విశాఖ డెయిరీ వ్యవస్థాపకులు ఆడారి తులసీరావు జయంతిని స్థానిక ప్రేమసమాజం ఆవరణలో డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమసమాజంలో తులసీరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రేమసమాజంలోని అనాథలకు భోజనాలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దేవరాపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల ఉండదని ఈపీడీసీఎల్ ఆపరేషన్ నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీడీవీ. రామకృష్ణ తెలిపారు.